

మానవ మృగాళ్లు!
పండు వృద్ధురాలిపై మండలంలో వెలుగు చూసిన లైంగిక దాడి ఘటన ప్రతిఒక్కరినీ నివ్వెరపోయేలా చేసింది. 8లో▸



బీసీలు రాణించాలి
బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. 8లో▸



శుభాకాంక్షల వెల్లువ
రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖల మంత్రి వాకిటి శ్రీహరికి పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రసన్నకుమార్‌శర్మ

మంచాల: కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన పేరూరి ప్రసన్న కుమార్ శర్మ శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రసన్నకుమార్ వెంట పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ సత్తయ్య తదితరులు ఉన్నారు.

30 వరకు బియ్యం పంపిణీ

జిల్లా సివిల్ సప్లై అధికారిణి వనజాతరెడ్డి



మాట్లాడుతున్న వనజాతరెడ్డి

బడంగ్‌పేట్: ఈ నెలాఖరు వరకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ ఉంటుందని.. లబ్ధిదారులు తొందరపడాల్సిన అవసరం లేదని జిల్లా సివిల్ సప్లై అధికారిణి వనజాతరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు రేషన్ దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలాపూర్‌లో రేషన్ దుకాణం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వనజాతరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు రేషన్ సరఫరా ఉంటుందని వదంతులు నమ్మి తొందరపడొద్దు అన్నారు. ఈ తనిఖీల్లో రేషన్ దుకాణల డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రసాయన రహిత సాగు చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



మాట్లాడుతున్న డీఏఓ నర్సింహారావు

మంచాల: రైతులు సాధ్యమైనంత వరకు రసాయన రహిత సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. క్రిమి సంహారక మందులు, యూరియా వాడకం తగ్గించాల్సిన అవసరం అందన్నారు. భూసార పరీక్షలతో పాటు పంట మార్పిడి చేయాలన్నారు. అనంతరం మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు సాగు మెళకువలు నేర్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం చిత్తాపూర్‌లోనూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్, సునీత, రామ్ ప్రకాశ్, పద్మజ, ఏడీఏ సుజాత, మంచాల ఏఓ కృష్ణమోహన్, ఏఈఓ నిఖిత, రైతు సంఘం అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

18 మందికి 'సీఎంఆర్ఎఫ్'



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 18 బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానిక హరికృష్ణ, రామకృష్ణ, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, బాబురావు, రవీందర్‌రెడ్డి, జేకే నర్సింలు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు హైవే

హైదరాబాద్–బీజాపూర్ హైవేపై ప్రయాణం అంటేనే జనం జంకుతున్నారు. చిన్న రోడ్డు, మూలమలుపులతో పాటు రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది.

- పదేళ్లుగా ప్రకటనలకే పరిమితమైన హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు



కేజీఆర్ గార్డెన్ సమీపంలో గుంతల్లో నిలిచిన నీరు



వాహనదారుల అప్రమత్త కోసం ఏర్పాటు చేసిన బారికేడ్

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈ మార్గం నేషనల్ హైవేగా అప్‌గ్రేడ్ అయిందని.. ఇక త్వరలోనే రోడ్డు విస్తరణ పూర్తవుతుందని పదేళ్లుగా చెబుతున్నా కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిత్యం వాహనాల రద్దీతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే జనం జంకుతున్నారు. దీనికి తోడుగా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షాలకు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. నేషనల్ హైవేగా మారడంతో ఆర్అండ్‌బీ శాఖ ఇటువైపు చూడడం మానేసింది. మలుపులు, గుంతల కారణంగా ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

ఎన్‌హెచ్ అధికారులు లేక ..

పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్ ఎదుట పెద్ద గుంత ఏర్పడింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. గతంలో దాతలు, ట్రాఫిక్ పోలీసులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా వర్షం నీరు వెళ్లే మార్గం లేక చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతోంది. తాజాగా పోలీసులు మున్సిపల్ అధికారులకు, ఎంపీడీఓకు మరమ్మతులు చేపట్టాలని వినతులు ఇచ్చారు. ఎన్‌హెచ్ అధికారులు అందుబాటులోకి రాకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. విస్తరణ చేపట్టకపోయినా.. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు, వాహనదారులు అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

"డ్రైన్ నిర్మిస్తేనే..



హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై చేవెళ్ల పరిధిలో ఎన్నో చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. గతంలో తమ వంతు బాధ్యతగా ఎన్నోసార్లు దాతల సహకారంతో గుంతలను పూడ్చాం. చిన్నపాటి వర్షం కురిస్తే సమస్యల మళ్లీ మొదటికి వస్తుంది. స్థానిక కేజీఆర్ గార్డెన్ ఎదుట పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. డ్రైన్ నిర్మాణం చేస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాం.

– ఎస్.వెంకటేశం, ట్రాఫిక్ సీఐ, చేవెళ్ల



నెర్రలుబారిన బ్రాహ్మణపల్లి చెరువు

వరుణ దేవా.. కరుణించవా!

- నెర్రెలు బారుతున్న చెరువులు, కుంటలు
- వట్టిపోతున్న బోరుబావులు
- వర్షాల కోసం రైతు ఎదురుచూపులు

యాచారం: రెండేళ్లుగా వర్షాలు సమృద్ధిగా లేక భూగర్భజలాల అడుగంటుతున్నాయి. ఈ ఏడాది సైతం గత పరిస్థితే ఉత్పన్నమయితే ఎలా అని రైతులు భయాందోళన చెందుతున్నారు. నాగార్జున సాగర్ (మిషన్ భగీరథ) కృష్ణా జలాలతోనే మహానగరంతో పాటు జిల్లావాసుల దాహార్తి తీర్చుతున్నారు. సాగర్‌లోనూ నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుతుండడంతో కృష్ణా జలాలు సైతం అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పెద్ద చెరువు, తుర్కయంజాల్ చెరువు మినహాయిస్తే జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలన్నీ ఎండిపోయి నెర్రలుబారాయి.

బంధం చెరువు నిండితేనే..

జిల్లాలోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి, కందుకూరు, ఆమనగల్లు, మహేశ్వరం తదితర మండలాల్లోని 300కు పైగా చెరువులు, కుంటలు పూర్తిగా వట్టిపోయాయి. రెండేళ్లుగా వర్షాలు లేక చెరువులు, కుంటల్లోని నీళ్లు చేరడం లేదు. జిల్లాలో సాగునీటి వనరులు లేవు. వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితే తప్పా బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగే పరిస్థితి లేదు. యాచారం, కడ్తాల్, కందుకూరు మండలాల సరిహద్దులోని తాడిపర్తి బంధం చెరువు నిండితే యాచారం మండల పరిధిలోని నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మల్కీజ్‌గూడ, కుర్మిద్ద తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయి.

ప్రమాదకర స్థాయిలో బోరుబావులు

యాచారం, మంచాల, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో 50 వేలకు పైగా బోరుబావులు వట్టిపోయే పరిస్థితిలో ఉన్నాయి. ప్రస్తుతం 30 వేలకు పైగా బోరుబావులు వట్టిపోయాయి. మృగశిర కార్తెలో సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే బోరుబావుల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. ఇప్పటికీ సరైన వర్షాలు కురవక పోవడంతో రైతులు వరినారు పోసుకునేందుకు ముందుకు రావడం లేదు.

"చెరువులో నీళ్లుంటేనే..



నక్కర్తమేడిపల్లి చెరువులో నీరుంటేనే తమ పొలంలోని బోరుబావుల్లో సమృద్ధిగా భూగర్భజలాలు ఉంటాయి. యాసంగి పంట కింద రూ.50 వేలకు పైగా ఖర్చు చేసి మూడు ఎకరాల్లో వరి సాగు చేపడితే నీరు లేక పంటంతా ఎండిపోయింది. రెండేళ్లుగా సరైన వర్షాలు కురవడం లేదు.

– బొగ్గుల పాపిరెడ్డి, నక్కర్తమేడిపల్లి

ఆశతో నారు పోశా



వర్షాలు కురుస్తాయనే ఆశతోనే మూడు ఎకరాలకు నారు పోశా. వర్షాలు సమృద్ధిగా కురిస్తే తమకున్న మూడు బోరుబావులతో పదెకరాల వరకు సాగు చేయొచ్చు. పంట దిగుబడి వచ్చే వరకు గ్యారంటీ లేకుండా పోతోంది. ఉరుములు, మెరుపులు తప్పితే సరైన వర్షాలు కురియడం లేదు.

– లిక్కి జంగారెడ్డి, కిషన్‌పల్లి

16న 'రైతు భరోసా'

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి


ఇబ్రహీంపట్నం రూరల్: రైతు భరోసా, రైతు వేదికల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమయన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ, ఉద్యాన, ఆర్డీఓ, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 16న రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా కార్యక్రమం, నూతనంగా నిర్మించిన 35 రైతు వేదికలు లాంఛనంగా ప్రారంభిస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించిన డివిజన్ రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలన్నారు. తమ మండల పరిధిలోని ప్రజాప్రతినిధులను, మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు స్థానిక నాయకులను ఆహ్వానించాలన్నారు. ముఖ్యమంత్రి ఆయా మండలాల రైతులతో మాట్లాడే అవకాశం ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలను అలంకరించి షామియానా, కుర్చీలు వేయించాలన్నారు. శనివారం గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

స్మార్ట్ 'ఫ్యూచర్'

20 ఏళ్ల అవసరాలు తీర్చేలా.. నాలుగో నగరి

- ప్రపంచ నగరాలతో పోటీపడేలా అభివృద్ధి
- ఫోర్త్ సిటీకు రెండు మాస్టర్ ప్లాన్లు
- 14 వేల ఎకరాల టీజీఐఐసీ భూములకు ఒకటి..
- 2 లక్షల ఎకరాల అథారిటీ పరిధికి మరొకటి
- 5 ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ శాశ్వత కార్యాలయం
- వారం రోజుల్లో 34 రెగ్యులర్ పోస్టుల భర్తీ: ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె.శశాంక





సాక్షి, రంగారెడ్డి జిల్లా : దేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా నిలవనున్న ఫ్యూచర్ సిటీ (నాలుగో నగరం).. స్థిరమైన, సమగ్రమైన స్మార్ట్ పట్టణీకరణ నగరంగా అభివృద్ధి చెందనుంది. ప్రపంచ నగరాలతో పోటీ పడేలా గ్రేటర్ హైదరాబాద్‌కు దక్షిణ భాగంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జాతీయ రహదారుల మధ్య అభివృద్ధి చేయనున్న ఈ ప్రతిష్టాత్మక నాలుగో నగరం 765.28 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంటుందని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) తొలి కమిషనర్ కె.శశాంక పేర్కొంటున్నారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్ ప్రణాళికలపై ఆయన ఏమంటున్నారంటే..

భవిష్యత్ నగరి ఎలా ఉంటుందంటే?

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత గ్రేటర్‌లో నాలుగో నగరం అవసరం ఉందని సీఎం రేవంత్ నిర్ణయించారు. మహేశ్వరం, ఆమన్ గల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల ఏడు మండలాల్లోని 56 గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి వస్తాయి. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కాలుష్య రహిత వాతావరణం ఈ నగరం ఉంటుంది. ఫోర్త్ సిటీకి ప్రతిష్టాత్మకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ, విదేశీ సంస్థలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక పాలసీలు, ప్రోత్సాహకాలు కల్పించనున్నాం.

మాస్టర్ ప్లాన్ ఇలా..

ఫార్మాసిటీ కోసం టీజీఐఐసీ ఇప్పటికే 14 వేల ఎకరాల భూమిని సేకరించింది. ఈ భూముల వరకూ ఒక మాస్టర్ ప్లాన్, ఎఫ్‌సీడీఏ పరిధి విస్తరించి ఉన్న సుమారు 2 లక్షల ఎకరాల వరకూ మరో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నాం. ప్రత్యేక జోన్‌లతో ఈ మాస్టర్ ప్లాన్‌లు వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. అథారిటీ కోర్ సిటీ మాస్టర్ ప్లాన్‌లో టీజీఐఐసీ మాస్టర్ ప్లాన్‌ను ఇంటిగ్రేటెడ్ చేస్తాం. ఈ మాస్టర్ ప్లాన్ల రూపకల్పన బాధ్యతలు హెచ్ఎండీఏకు ఇవ్వాలని సూత్రప్రాయంగా భావిస్తున్నాం.

బడ్జెట్ కేటాయింపులు..

తొలి విడతగా ప్రభుత్వ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించింది. మాస్టర్ ప్లాన్ అభివృద్ధితో పాటు రహదారులు, విద్యుత్, నీరు వంటి మౌలిక అవసరాలకు ఖర్చు చేయనున్నాం. ఇతరత్రా వ్యయాల కోసం మరో విడత బడ్జెట్‌ను విడుదల చేయాలని ఇటీవలే ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు నివేదించాం.

ఎఫ్‌సీడీఏలో సిబ్బంది భర్తీ ఎప్పుడు పూర్తవుతుంది?

ఎఫ్‌సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ముందుగా ప్లానింగ్, ఇంజినీరింగ్ వంటి పలు విభాగాలలో 34 పోస్టుల భర్తీ ఉంటుంది. మున్సిపల్, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ వంటి పలు విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై రానున్నారు. సీఎం వోకు ఫైల్ చేరింది. వారం రోజుల్లో భర్తీ పూర్తవుతుంది.

ఈ సిటీలో ఏం ఉంటాయంటే?

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అనుసంధానిస్తూ ఫ్యూచర్ సిటీకి మెట్రో కనెక్టివిటీ ఉంటుంది. ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, గ్రీన్ బిల్డింగ్, స్మార్ట్ లివింగ్ ఎకో సిస్టమ్ ఉంటుంది. ఇందులో కృత్రిమ మేధ (ఏఐ), ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ జోన్ వంటి ప్రత్యేక జోన్లు ఉంటాయి. ఫోర్త్ సిటీలో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటికే బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

హరిచందన.. బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా హరిచందన దాసరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్లు జి.ముకుంద రెడ్డి, కదిరవన్ పలని, జిల్లా అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న వీపీ గౌతమ్

తుక్కుగూడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ సూచించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను అడిగి మున్సిపల్ పరిధిలో ఎంత మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించారు అని తెలుసుకున్నారు. ప్రభుత్వం మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు 450 నుంచి 650 అడుగుల వరకు నిర్మించుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈ బిక్కునాయక్, ఏఈ వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఎ.వాణి, పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

- అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు
- మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన అక్రమ నిర్మాణం



చిలుకూరు రెవెన్యూలో అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగైదు అంతస్తుల భవనాలను యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో అక్రమ నిర్మాణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

తొమ్మిది గ్రామ పంచాయతీల విలీనంతో మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పడింది. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్, చిలుకూరు, మొయినాబాద్, సురంగల్, పెద్దమంగళారం, అప్పోజీగూడ, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్ గ్రామాలు గతంలో పంచాయతీలుగా ఉన్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో ప్రస్తుతం బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల మధ్యలో మొయినాబాద్ మున్సిపాలిటీ 111 జీవో పరిధిలో ఉంది. జీవో ప్రకారం ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదు. కానీ వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఒక్కో భవనాన్ని నాలుగు నుంచి ఆరు అంతస్తులకు పైగా నిర్మిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో సైతం నిర్మాణాలు జరుగుతున్నా ఆపేవారే కరువయ్యారు.

నోటీసులిచ్చి వసూళ్ల పర్వం

అక్రమ నిర్మాణాలు మున్సిపల్ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఎక్కడైనా నిర్మాణం జరుగుతుందంటే అక్కడికి వెళ్లి ముందుగా నోటీసులు ఇస్తున్నారు. నోటీసులు అందుకున్న నిర్మాణదారులు నేరుగా పై అధికారులను కలిసి ముడుపులు ముట్టజెబుతున్నారు. దీంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పై అధికారులు కింది స్థాయి అధికారులు, సిబ్బందికి హుకూం జారీ చేస్తున్నారు. గోడల నిర్మాణం చేపట్టి వెంటనే తెల్లరంగు వేయాలని అక్రమ నిర్మాణాలు చేసేవారికి అధికారులే సలహాలు ఇస్తున్నారు. నిర్మాణం పూర్తయిన వెంటనే ఇంటి నంబర్‌కోసం దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో ఓ కోటరీ తయారైనట్లు తెలుస్తోంది.

"నోటీసులు ఇస్తున్నాం

ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే నోటీసులు ఇస్తున్నాం. పనులు ఆపేస్తున్నాం. కొందరు నోటీసులు ఇచ్చినా మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అలాంటి వారికి మరోసారి నోటీసులిచ్చి నిర్మాణాలను అడ్డుకుంటాం.

– ఖాజా మొయిజుద్దీన్, కమిషనర్

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ

నందిగామ: బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో బీసీ సేనా మహిళా కమిటీ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గ్రామ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీలంతా ఏకమై హక్కుల కోసం పాటుపడాలని సూచించారు. గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా గౌతమి, ఉపాధ్యక్షురాలిగా నిర్మలమ్మ, ప్రధాన కార్యదర్శిగా సరిత, కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కోశాధికారిగా సంగీతను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖరప్ప, మహిళా కమిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి, మండల అధ్యక్షురాలు జ్యోతి అసెంబ్లీ కార్యదర్శి శారద, నాయకులుసదర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం వెళ్లిన యువతి అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: పాలిటెక్నిక్ కళాశాల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కుర్మల్‌గూడ పరిధి ఇంద్రానగర్ కాలనీకి చెందిన కొడవళ్లూరి జయదుర్గా పురందేశ్వరి ఈ నెల 12న ఉదయం 10గంటల ప్రాంతంలో మీర్‌పేట్‌లోని కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మానవ మృగాళ్లు!



వృద్ధులు, ఒంటరి మహిళలే లక్ష్యంగా కామాంధులు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కామంతో కళ్లు మూసుకుపోయి రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారు.

- వృద్ధులు, ఒంటరి మహిళలే టార్గెట్
- మద్యం, గంజాయి మత్తులో అఘాయిత్యాలు
- యాచారం మండలంలో నివ్వెరపోయే ఘటనలు

యాచారం: తొంభై ఏళ్ల పండు వృద్ధురాలిపై మండలంలో వెలుగు చూసిన లైంగిక దాడి ఘటన ప్రతిఒక్కరినీ నివ్వెరపోయేలా చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యుల్లోనూ ఆందోళన నెలకొంది. ఏ గ్రామంలో చూసినా మద్యం ఏరులై పారుతోంది. దీనిపై ఇటు ఎక్సైజ్, అటు పోలీసు శాఖలు పూర్తిగా చేతులెత్తేశాయనే ఆరోపణలున్నాయి. యాభై ఇళ్లు కూడా లేని పల్లెల్లో సైతం పదుల సంఖ్యలో బెల్టు షాపులు నడుస్తున్నాయి. గత బుధవారం వృద్ధురాలిపై అఘాయిత్యం జరిగిన గ్రామంలో కూడా కొంతమంది యువకులు అర్ధరాత్రి వరకూ మద్యం మత్తులోనే ఉంటారని, ఊరిలో విచ్చల విడిగా తిరుగుతుంటారని విచారణ కోసం వచ్చిన పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇలాంటి వారిపై సమాచారం ఇస్తే ఎక్కడ తమపై దాడి చేస్తారనే భయంతో మిన్నకుండిపోతున్నామని తెలిపారు. మండలంలోని మాల్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, యాచారం, నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, నందివనపర్తి, చింతుల్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో ఈ వాతావరణం ఎక్కువగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాల్ ఘటన మరవకముందే..

నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారి పక్కన ఉండే మాల్ మండల కేంద్రంలోని ఓ దుకాణం ఎదుట నిద్రిస్తున్న 70 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి జరిగింది. సీసీ పుటేజీల ఆధారంగా ఈ అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిని పట్టుకున్న పోలీసులు అతన్ని జైలుకు పంపించారు. గత ఫిబ్రవరిలో చోటుచేసుకున్న ఈ ఘటనను మరవకముందే మరో దాడి జరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా పోలీసు శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని, రాత్రివేళ పెట్రోలింగ్ ముమ్మరం చేసి, ప్రజల మానప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పోలీసులదే బాధ్యత



వృద్ధులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్షలు పడేలా చూడాల్సిన బాధ్యత పోలీసుపై ఉంది. గ్రామాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలను అరికట్టాలి. గంజాయి విక్రయించే, సేవించే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలి. ప్రజలకు అన్ని విధాలుగా రక్షణ కల్పించాలి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

సైకో పనేనా..?

మండలంలో వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడింది ఓ సైకో కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. మద్యానికి బానిసైన కామాంధుడే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక్కడే ఉన్నాడా..? ఇంకెవరికైనా సంబంధం ఉందా..? అనే దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. బాధిత వృద్ధురాలి వద్దకు తరచూ ఎవరెవరు వెళ్లేవారు..? గతంలో డబ్బుల కోసం ఆమెను బెదిరించింది ఎవరు..? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వృద్ధురాలి ఛాతిపై బలంగా దాడి చేయడంతో పాటు గొంతు నులమడంతో స్పృహ కోల్పోయింది. దీంతో చనిపోయిందని భావించిన దుండగుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి రక్తస్రావం తగ్గకపోవడంతో శుక్రవారం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిసింది. ఆతర్వాత స్పృహలోకి వచ్చిన ఆమె కుటుంబ సభ్యులకు పలు విషయాలు చెప్పినట్లు సమాచారం. ఈ ఆధారాలతో నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కామాంధుడిని పట్టుకుని, సరైన శిక్ష పడేలా చూస్తామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



రింకూసింగ్(ఫైల్)

కొత్తూరు: రైలు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రింకూసింగ్(22) పట్టణంలోని అద్దెకు ఉంటూ ఓ పరిశ్రమంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఉద యం పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఆయ న్ను రైల్వే వంతెన సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడ వెళ్తున్న డెమో రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రింకూసింగ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. లోకోపైలెట్ చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గిరిజన విద్యార్థులకు డిగ్రీలో నేరుగా అడ్మిషన్లు

షాద్‌నగర్ రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నేరుగా అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ ఐడీతో ఆఫ్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రవేశం తీసుకోవచ్చని సూచించారు. దోస్త్ ఐడీతో పాటుగా అన్ని సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు. మీసేవలో, ఆన్‌లైన్ సెంటర్లలో ఎలాంటి ఫీజు చెల్లించవద్దని, కళాశాలలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బీజెడ్‌సీ, సీఎంజెడ్సీ, బీఏ, బీకాం, ఎంపీసీ, ఎంపీసీఎస్, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం గిరిజన విద్యార్థినులకు మాత్రమే సీట్లు ఉన్నాయని వివరించారు. వివరాలకు 6305051490, 9885003390, 9703441345 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

తల్లి మందలించిందని కొడుకు అదృశ్యం



మాణిక్యం

చేవెళ్ల: తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన కొడుకు ఈనెల 6న అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చనువెల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వీరన్నోళ్ల జంగయ్య, నీలమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇంటి పనుల కోసం వినియోగించే బైక్‌ను బాగు చేయించమని వీరి కుమారుడు మాణిక్యం (22)ను తల్లి మందలించింది. అనంతరం తల్లిదండ్రులిద్దరూ ఎప్పటిలాగే పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం వచ్చే సరికి కొడుకు కనిపించలేదు. మాణిక్యం తన సామగ్రి తీసుకుని, హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడని పక్క వాళ్ల ద్వారా తెలుసుకుని తనే తిరిగి వస్తాడులే అని భావించారు. రెండు రోజుల తర్వాత కూడా రాక పోవడంతో ఫోన్ చేశారు. కానీ అతను స్పందించడం లేదు. దీంతో ఆందోళనకు గురై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బ్యాక్‌లాగ్ విద్యార్థులకు మరో అవకాశం

చార్మినార్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 1987 నుంచి 2012 మధ్య కాలంలో యూజీ (డిగ్రీ) కోర్సుల్లో చేరి పలు కారణాలతో మధ్యలో ఆపేసిన విద్యార్థులకు తిరిగి పూర్తి చేసుకునే అవకాశాన్ని విశ్వవిద్యాలయ అధికారులు కల్పించారని సిటీ కళాశాల అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ శంకర్ కుమార్ శుక్రవారం తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని యూనివర్సిటీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి రీ అడ్మిషన్ పొంది బ్యాక్ లాగ్ పరీక్షలకు ఫీజు చెల్లించి హాజరు కావచ్చని ఆయన చెప్పారు. 2025 డిసెంబర్ లోపు రెండు అవకాశాల్లో రీ అడ్మిషన్ పొందిన విద్యార్థులు డిగ్రీ పరీక్షలకు హాజరై కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా 2013, 2014, 2015, 2016 బ్యాచుల బ్యాక్ లాగ్ అభ్యర్థులు రీ అడ్మిషన్ పొంది థియరీ, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ఎటువంటి ఆలస్య రుసుం లేకుండా రీ అడ్మిషన్ పొందవచ్చని, రూ.500 ఆలస్య రుసుంతో ఈనెల 26 వరకు మరో అవకాశం లభిస్తుందని తెలిపారు. జూలై 30 నుంచి ఆగస్టు 11 వరకు నిర్ణయింపబడిన తేదీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 90000 22997, 73829 29622 నెంబర్లలో సంప్రదించవచ్చు.

మంత్రి శ్రీహరికి శుభాకాంక్షల వెల్లువ



ఆమనగల్లు: మంత్రి శ్రీహరికి శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత



షాద్‌నగర్: వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖలు, క్రీడల, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి గీత తిరుమల శ్రీవారి ప్రసాదం అందజేసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

'వాకిటి'కి 'చౌలపల్లి' సన్మానం

షాద్‌నగర్: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖలు, క్రీడల, యువజన సర్వీసులు శాఖ మంత్రిగా నియమితులైన వాకిటి శ్రీహరిని శుక్రవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఘనంగా సన్మనించారు. నగరంలోని మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఆయన శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చౌలపల్లి వెంట నాయకులు శివశంకర్‌గౌడ్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే బడుగుల సంక్షేమం

షాబాద్: కాంగ్రెస్‌తోనే బడుగుల సంక్షేమం సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మంత్రి వాకిటి శ్రీహరిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం, అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందన్నారు. ఆయన వెంట గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు రాజుగౌడ్ ఉన్నారు.



షాబాద్: శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు

మన్నికలో మేటి భారతి సిమెంట్

- సంస్థ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్
- మోకిలలో తాపీ మేస్త్రీలకు బీమా బాండ్ల పంపిణీ

శంకర్‌పల్లి: మన్నికకు మారు పేరు భారతి సిమెంట్ అని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ అన్నారు. శంకర్‌పల్లి మండలం మోకిలలోని మాదాపూర్ స్టీల్ మార్కెటింగ్ డీలర్ షాపు వద్ద శుక్రవారం తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను మార్కెట్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ప్రస్తుతం దీని ధర కొంత అధికంగా ఉన్నప్పటికీ పనితీరు సైతం అదే స్థాయిలో ఉంటుందన్నారు. అనంతరం 30 మంది తాపీ మేస్త్రీలకు రూ.1 లక్ష ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేశారు. సమావేశంలో డీలర్ నర్సిరెడ్డి, పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్

ముగిసిన క్రీడా శిక్షణ

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో నెలరోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిక్షణలో విద్యార్థులకు కబడ్డీ, కరాటే, కర్రసాము తదితర క్రీడలపై తర్ఫీదు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ధ్రువీకరణ పత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా కోచ్‌లు శంకర్‌యాదవ్, ప్రశాంతిచారి, ఆర్యన్‌లను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



నాలాల్లో ఆటంకాలు ఉండకూడదు

హైడ్రా కమిషనర్ రంగనాథ్



చింతల్‌బస్తీ నాలాను పరిశీలిస్తున్న రంగనాథ్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని, నాలాల్లో ఎక్కడా నీటి ప్రవాహానికి ఆటంకాలు ఉండకూడదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. నాలాల్లో ఉన్న ఆక్రమణలీ వెంటనే తొలగించాలని ఆదేశించారు. చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. బంజారాహిల్స్ రోడ్డు నం.12, పింఛన్ ఆఫీసు దగ్గర 15 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా చింతలబస్తీ వైపు 7 మీటర్ల కు తగ్గడంతో హైడ్రా కబ్జాలను తొలగించింది. ఆక్రమణల కారణంగా కల్వర్టు కింద సగం భాగం పూడిపోయినట్లు గుర్తించారు. ఆ పూడిక తీతను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జేసీబీలను నాలాలోకి దింపి చెత్తను తొలగించాలని సూచించారు. వరద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. శంకరిపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే ఈ నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూ కాలనీ, షేక్‌పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హకీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలిటరీ ఏరియా, బంజారాహిల్స్, చింతల్ బస్తీ, తుమ్మల బస్తీ, ఖైరతాబాద్ మీదుగా ప్రవహించి హుస్సేన్ సాగర్‌కు నీటిని చేరుస్తుంది.

ప్రశాంతంగా ముగిసిన బార్ల డ్రా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో 24 కొత్త బార్లకు శుక్రవారం నిర్వహించిన డ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. గ్రేటర్ పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు అందిన విషయం విదితమే. గోల్కొండ నార్సింగ్ ప్రాంతంలోని కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ హాల్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీశారు. జాయింట్ కమిషనర్ కేఏవీ శాస్త్రి గెలుపొందిన వారి వివరాలను వెల్లడించారు. 90 రోజుల్లోగా నిబంధనల ప్రకారం బార్లను తెరవాలని సూచించారు. రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసు విచారణ జులై 25కు వాయిదా

సిటీ కోర్టులు: తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన ఓటుకు నోటు కేసు విచారణ శుక్రవారం నాంపల్లిలోని మొదటి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ విచారణకు జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకటవీరయ్య హాజరు కాగా సీఎం రేవంత్ రెడ్డి, ఉదయ్ సింహా, వేం కృష్ణ కీర్తన్, సెబాస్టియన్, గైర్హాజరయ్యారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన కోర్టు నిందితులను ఎగ్జామినేషన్ చేసేందుకు తదుపరి విచారణను జులై 25కి వాయిదా వేసింది.